


# పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టులా?

**మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ ఆగ్రహం**

**బలగం టీవీ, బోయినిపల్లి;**

అర్ధరాత్రి అరెస్టులతో మాజీ సర్పంచుల ఉద్యమాన్ని అణచివేయలేరని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి పిలుపునిచ్చారనే ముందస్తు సమాచారంతో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ: తాము చేసిన పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా అడుగుతుంటే, పరిష్కరించాల్సింది పోయి, ఇలా రాత్రికి రాత్రే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచులను అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. అరెస్టులతో సర్పంచుల ఉద్యమాలను, వారి పోరాట పటిమను అణచివేయలేరని హెచ్చరించారు. ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వీడి, తక్షణమే సర్పంచుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# కేసీఆర్ దార్శనికతతోనే తెలంగాణ పునర్నిర్మాణం..

**బంగారు తెలంగాణ రూపశిల్పి కేసీఆర్..**

**-మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆజ్జూ**

**బలగం టీవీ, బోయినిపల్లి :**




జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయమని, దశాబ్దాల తరబడి సాగిన అస్తిత్వ పోరాటం ఫలితంగా మన గడ్డ తిరిగి జన్మించిన చారిత్రాత్మక దినమని మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆజ్జూ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మహ్మద్ ఆజ్జూ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రోజు ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ గర్వపడే రోజని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనేది కేవలం ఉద్యమం మాత్రమే కాదని, అది ప్రజల ఆకాంక్ష అని, ఆ ఆకాంక్షను సాకారం చేసిన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు అని అన్నారు . కేసీఆర్ ఒక నాయకుడిగానే కాకుండా ఒక ఉద్యమ స్ఫూర్తిగా నిలిచి, 'తెలంగాణ వస్తుంది' అనే నమ్మకాన్ని నిజం చేసిన దృఢసంకల్పుడని అన్నారు.

తెలంగాణ ప్రజల ఆవేదనను, బాధలను తన గుండెతో వినగలిగిన నేత కేసీఆర్ అని, రాత్రింబవళ్లు ప్రజల మధ్యే ఉండి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని అన్నారు . తెలంగాణ ఆవిర్భావం తర్వాత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని అన్నారు. ప్రధానంగా మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం, రైతు బంధు, రైతు భీమా వంటి పథకాలతో అన్నదాతకు భరోసా కల్పించడం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో సామాజిక న్యాయాన్ని చేకూర్చడం వంటివి కేసీఆర్ పాలనలో విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. అలాగే టిఎస్–ఐపాస్, ఫార్మా సిటీ, ఐటీ రంగాల విస్తరణతో రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణం జరిగిందని తెలిపారు.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అనేది కేవలం పండుగ మాత్రమే కాదని, ఇది ప్రజల మనోభావాలకు, నాయకత్వ గుర్తింపునకు నిలువెత్తు నిదర్శనమనిఅన్నారు . కేసీఆర్ నాయకత్వంలో, ప్రజల భాగస్వామ్యంతోనే తెలంగాణ భవిష్యత్తు మరింత వెలుగులు నింపుకుంటుందని, రాష్ట్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# కేసీఆర్ దృఢ సంకల్పంతోనే సాకారమైన తెలంగాణ స్వప్నం

**మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఆజ్జూ...**

**బలగం టీవీ, బోయినిపల్లి:**




జూన్ 2 తెలంగాణ ప్రజల దశాబ్దాల కల సాకారమైన చారిత్రాత్మక రోజని, రాష్ట్ర ప్రజల స్వప్నాన్ని నిజం చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నిబద్ధతకే దక్కుతుందని మండల మాజీ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆజ్జూ పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెసిఆర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదని, ఒక ఉద్యమ స్వరూపమని కొనియాడారు. "తెలంగాణ వస్తుంది" అనే నినాదాన్ని తన దృఢసంకల్పంతో యథార్థంగా మార్చి, రాత్రింబవళ్ళు ప్రజల మధ్య ఉండి వారి కష్టాలను శోధించిన నేత కేసీఆర్ అని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని ఆయన గుర్తుచేశారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, రైతుబంధు, రైతుబీమా పథకాలతో అన్నదాతకు భరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో సామాజిక న్యాయం చేకూరిందని వివరించారు. అలాగే టీఎస్–ఐపాస్, ఫార్మా సిటీ, ఐటీ రంగాల వృద్ధితో ఆర్థిక పునర్నిర్మాణం సాధ్యమైందన్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవం కేవలం వేడుక మాత్రమే కాదని, ప్రజల మనోభావాలకు నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొంటూ.. కేసీఆర్ నాయకత్వంలో, ప్రజల భాగస్వామ్యంతోనే ఉజ్వల తెలంగాణ భవిష్యత్తు సాధ్యమవుతుందని మహ్మద్ ఆజ్జూ స్పష్టం చేశారు.

# ఘనంగా బీసీ ఉద్యమ నేత పర్శ హన్మాండ్లు 50వ జన్మదిన వేడుకలు

**రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

బీసీ ఉద్యమ నేత, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న పర్శ హన్మాండ్లు 50వ జన్మదిన వేడుకలను జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల బీసీ భవన్‌లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే సిరిసిల్ల ఎల్లమ్మ దేవాలయం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించి పర్శ హన్మాండ్లుకు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు బోయిని శ్రీనివాస్, తడుక కమలాకర్, చెన్నమనేని రాజ్‌కుమార్ మాట్లాడుతూ, బీసీల చైతన్యం, అభివృద్ధి కోసం పర్శ హన్మాండ్లు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించి రెండు సార్లు జైలుకు వెళ్లారని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు బీసీ స్టడీ సర్కిల్, బీసీ గురుకులాల మంజూరులో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు కూడా ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. తన జీవితాన్ని బీసీ సమాజ అభ్యున్నతికి అంకితం చేసిన పర్శ హన్మాండ్లుకు యావత్తు బీసీ సమాజం రుణపడి ఉంటుందని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.



# పలు కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ నియోజకవర్గంలోని పలువురు ప్రముఖుల కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు సుడిగెపు పరశురామ్ తండ్రి సుడిగెపు భూమయ్య గారు గుండెపోటుతో మృతి చెందగా, వారి భౌతికకాయానికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి తల్లి చెలుకల బుచ్చవ్వ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. చందుర్తి మండలం మల్యాల గ్రామ మాజీ ఉపసర్పంచ్‌లు పడిగెల కొండయ్య, పడిగెల శ్రీనివాస్‌ల తండ్రి పడిగెల వెంకయ్య ఇటీవల కన్నుమూయగా, వారి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. అదేవిధంగా కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి తల్లి నాంపల్లి గంగూబాయి మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగం స్వరూప––మహేష్ రెడ్డి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఆకుల దేవరాజం, రుద్రంగి వార్డు సభ్యుడు ఉప్పులూటి గణేష్, బొడిగె అనిల్ గౌడ్, దేవరాజు, గుడిసె అనిల్, సిరికొండ మాజీ సింగిల్ విండో చైర్మన్ దేవరాజు, ఉపసర్పంచ్ అనపర్తి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. సంరక్షించాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**




వాతావరణ సమతుల్యత.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని.. వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూన్ 1 వ తేదీ నుంచి12 వ తేదీ వరకు పర్యావరణ ఉత్సవాలలో భాగంగాజిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమీపంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ సత్యనారాయణ, జిల్లా అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు మామిడి మొక్కలు నాటి.. నీటిని పోశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడంతో ప్రస్తుతంతో



పాటు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. పర్యావరణ ఉత్సవాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్పుద్దిన్, ఉద్యానవన శాఖ అధికారి శరత్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు, అన్‌లోడింగ్‌లో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం...**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, అన్‌లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆమె అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో పాటు పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి, మెప్మా, రవాణా తదితర శాఖల జిల్లా అధికారులతో ధాన్యం సేకరణపై ప్రత్యేక టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్రాల్లో తూకం పూర్తయిన ధాన్యం బస్తాలను వెంటనే అపరెల్ పార్క్, రైస్ మిల్లులు, గోదాములకు తరలించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గన్నీ సంచుల లభ్యత, ట్యాబ్ ఎంట్రీ పురోగతిపై ఆరా తీసిన ఆమె.. కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుండి వాహనాలు, హమాలీలను అపరెల్ పార్క్‌కు తరలించి అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్లు సజావుగా పూర్తి కావాలని, రవాణా కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలను సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదు..

**-కేటీఆర్,హరీష్ రావులు చేస్తున్నది అసత్య ప్రచారం..**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడం లేదని, ఈ విషయంలో కేటీఆర్, హరీష్ రావు ఉద్దేశపూర్వకంగానే రైతులను తప్పుదోవ పట్టిస్తూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు . సోమవారం సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం గొల్లపల్లి గ్రామ ఉపసర్పంచ్ బండ గణేష్ పలువురు తో కలిసి వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ పాలనపై నమ్మకంతోనే ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, ఎన్నికలన్నింటిలోనూ ప్రజలు కాంగ్రెస్ కు అండగా నిలుస్తున్నారని అన్నారు .

వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లుగా కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అసలు ముఖ్యమంత్రి ఎప్పుడూ అలా అనలేదని అన్నారు . రైతులను మభ్యపెట్టేందుకే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ అనేది కేసీఆర్ ఘనత కాదని, ఉచిత విద్యుత్ పథకానికి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి శ్రీకారం చుట్టారని అన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిన పథకాన్నే గత ప్రభుత్వం కొనసాగించిందని, కేసీఆర్ పాలనలో ఎప్పుడూ 12 గంటలకు మించి విద్యుత్ అందిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అంతరాయం లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తోందని, అందుకే ఈ యాసంగిలో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సమస్యలపై రైతులు ధర్నాలు చేయలేదని అన్నారు . వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేకసార్లు స్పష్టంగా ప్రకటించారని, దీనిపై సీఎం విసిరిన సవాల్‌కు కేటీఆర్ సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. మీటర్లు పెట్టకపోతే బీఆర్ఎస్ రాజకీయాల నుండి తప్పుకుంటుందా అని ప్రశ్నించారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతపై తీవ్ర విమర్శలు ఉన్నాయని,ఆ ప్రాజెక్టు నిర్మాణ లోపాల వల్లే కుళేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. ఎన్ని అప్పులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తోందని, నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతం చేశామని అన్నారు .

# వేములవాడలో వీవోల నిరాహార దీక్ష... టీఆర్ఎస్ నాయకుల సంపూర్ణ మద్దతు...



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై వీవోలు (ఎఉం) చేపట్టిన నిరాహార దీక్షకు టీఆర్ఎస్ (బిఆర్ఎస్) నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు యామ తిరుపతి మాట్లాడుతూ.. వీవోల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీవోల ప్రధాన డిమాండ్లయిన గౌరవ వేతనాన్ని రూ.20,000లకు పెంచాలని, 58 జీవోను సవరించాలని, తమ సేవలను స్వయం ఉద్యోగాలుగా గుర్తించడంతో పాటు అర్హులైన వీవోలకు పదోన్నతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వీవోలు చేస్తున్న ఈ డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని పేర్కొన్న నాయకులు, ప్రభుత్వం వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. న్యాయం జరిగే వరకు దీక్ష చేస్తున్న వీవోలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

# శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**వేసవి సెలవుల ముగింపు నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి**

**బలగం టీవీ, వేములవాడ**

వేసవి సెలవుల ముగింపు దశకు చేరుకోవడంతో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ అధికంగా నమోదైంది. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన ఈ ఆలయానికి విద్యార్థులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పాఠశాలలు, హాస్టళ్లకు తిరిగి వెళ్లే ముందు స్వామివారిని దర్శించుకోవాలనే ఉద్దేశంతో భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకున్నారు. తలనీలాలు సమర్పించడంతో పాటు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే రుద్రాభిషేకం, అన్నపూజ, నిత్య చండీహోమం, నిత్య కల్యాణం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, లింగార్చన, ఆకుల పూజ తదితర విశేష పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం, కోడె మొక్కుల క్యూలైన్ల వద్ద సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, క్యూలైన్ల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ, కోడెలకు దారాలతో అల్లిన దండలు వేయరాదని, కొబ్బరికాయలను ఆలయం



బయట లేదా అనధికారిక ప్రాంతాల్లో కొట్టరాదని సూచించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదేశంలోనే కొబ్బరికాయలు కొట్టాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. దీనివల్ల పరిశుభ్రతతో పాటు ఇతర భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు.

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. భక్తుల రద్దీ మధ్యన కూడా ఆలయ సిబ్బంది సమన్వయంతో సేవలు అందించడంతో భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు అధికారులు తెలిపారు.

# గ్రామాల్లో వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలి..



### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగంటీవీ,రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని అన్ని గ్రామాల్లో వ్యర్థాల నిర్వహణను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, తడి, పొడి, సానిటరీ వేస్ట్ నిర్వహణపై ప్రజలకు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా "స్వచ్ఛ గ్రామం – సురక్షిత జల వాయువు" కార్యక్రమ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుండి ఈ నెల 5వ తేదీ వరకు రోజువారీగా స్వచ్ఛ గ్రామం – సురక్షిత జల వాయువు కార్యక్రమాలను పక్కాగా నిర్వహించనున్నమని అన్నారు. ఈ కార్యక్రమం యొక్క ఆవశ్యకతను అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని, ముఖ్యంగా పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్తను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ రియూస్, రెడ్యూస్, రెఫ్యూస్, రీసైక్లింగ్ విధానాన్ని అవలంబించేలా గ్రామపంచాయతీలు చర్యలు చేపట్టాలని సూచించారు. కంపోస్టు షెడ్లలో తడి చెత్తను ఉపయోగించి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని, అలాగే పొడి చెత్తను సేకరించి, వర్గీకరించి స్క్రాప్ డీలర్లకు విక్రయించడం ద్వారా గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దీన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి**

ప్రజావాణిలో వచ్చిన వినతులపై వెంటనే చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

291 దరఖాస్తుల స్వీకరణ

రాజన్న సిరిసిల్ల, జూన్ 1: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను సత్వరంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించిన కలెక్టర్, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 291 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

**డివిజన్ స్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతోందని, స్థానిక ప్రజలు తమ సమస్యలు, వినతులను సంబంధిత కార్యాలయాల్లో సమర్పించి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్యకు బంగారు అవకాశం

### చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే మైనారిటీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద అర్హులైన మైనారిటీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి (ఎఫ్ఏసీ) అయేషా తలత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ దేశాల్లోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

2026 జనవరి 1 నుంచి జూన్ 30 మధ్యకాలంలో (స్ప్రింగ్ సీజన్--2026) విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు జూన్ 1 నుంచి జూన్ 30 సాయంత్రం 5 గంటల వరకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం హార్డ్‌కాపీతో పాటు అవసరమైన పత్రాలు, ధ్రువపత్రాలను జూలై 31 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, కలెక్టరేట్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, గది నం. ఎఫ్--26, రాజన్న సిరిసిల్లలో సమర్పించాలని సూచించారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల వరకు స్కాలర్‌షిప్‌తో పాటు రూ.60 వేల వరకు లేదా వాస్తవ విమాన ఛార్జీ, ఏది తక్కువైతే అది వన్‌వే విమాన ప్రయాణ ఖర్చుగా అందజేయనున్నట్లు తెలిపారు. పత్రాల పరిశీలనలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు తేలితే సంబంధిత అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వయోపరిమితి, విద్యార్హతలు, కుటుంబ వార్షిక ఆదాయం తదితర అర్హతల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99499 10328 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.



# పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### లబ్ధిదారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసిన విప్

**బలగంటీవీ, వేములవాడ:**

పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామంతో పాటు వేములవాడ పట్టణంలోని లాలపల్లెలో నిర్వహించిన గృహ ప్రవేశాల కార్యక్రమాలకు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తవుతున్నాయని, రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్నారని అన్నారు.. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# రోడ్డు వెడల్పును 30 ఫీట్లకు తగ్గించాలని పంచాయతీ కార్యదర్శి కి వినతి

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో రోడ్డు వెడల్పును 30 పీట్లకు తగ్గించి తీర్మానించాలని కోరుతూ ఇండ్లు కోల్పోతున్న సుమారు 40 కుటుంబాల బాధితులు గ్రామ పంచాయతీ కార్యదర్శికి ,పాలక వర్గానికి వినతిపత్రం అందించారు. గ్రామంలో ప్రధాన రహదారి నీ 60 పీట్ల వెడల్పు చేయాలని గ్రామ పంచాయతీ పాలక వర్గం తీర్మానించింది.

గ్రామ పంచాయతీ పాలక వర్గం నిర్ణయంతో గ్రామానికి చెందిన పలువురు పేదల,ఇతరులు పూర్తిగా ఇల్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కొంతమందికి ఇల్లు కట్టుకుందామన్న స్థలం లేదనీ,ఇటీవలే దిమ్మడి పోచమ్మ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా అట్టి ఇంటి నిర్మాణం రోడ్డుకు 15 పీట్లలో నిర్మాణం జరిగిందనీ, 60 ఫీట్ల రోడ్డు తీస్తే నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు తొలగించే పరిస్థితి ఉంటుందని బాధితులు తెలిపారు. ఇల్లు కోల్పోతున్న బాధితుల వినతి నీ పరిగణలోకి తీసుకొని రోడ్డు వెడల్పు ను 30 ఫీట్లకు తగ్గించాలని, బాధితులకు ఇంద్రమ్మ ఇళ్లతో పాటు, స్థలం లేని వారికి స్థలం కూడా కేటాయించాలని కోరారు. బొప్పాపూర్ గ్రామానికి బైపాస్ రోడ్డు గ్రామ వైకుంఠ థామం వరకు ఉందని అట్టి బైపాస్ రోడ్డు ను గంగమ్మ గుడి వరకు నిర్మించి నట్లయితే ఎవరు కూడా ఇల్లు కోల్పోయే పరిస్థితి ఉండదని బాధితులు సూచించారు. ఈ మేరకు



బాధితులు గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి కి,ఉపసర్పంచ్ కొండాపురం వెంకటరెడ్డి ,కార్యదర్శి సంతోష్ లను కలిసి పత్రాన్ని అందజేశారు. తమ వినతిని పట్టించుకోక పోతే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని,ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని బాధితులు హెచ్చరించారు.




# జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలి

### ప్రభుత్వం బలహీన వర్గాలకు అన్యాయం చేస్తోంది: కొంకటి శేఖర్

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కొంకటి శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతి, ఇతర సౌకర్యాలు అందించేందుకు పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములయ్యే విధంగా వ్యవస్థ కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.17 కారణంగా కాంట్రాక్టుల వ్యవస్థ కొద్ది వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువ పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్ల అభివృద్ధికి ఈ జీవో అడ్డంకిగా మారుతుందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా అన్ని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదని, విద్యార్థుల మరణాలు, ఆహార విషబాధ ఘటనలపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. బలహీన వర్గాల ప్రయోజనాలను కాపాడే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నెం.17ను రద్దు చేసే వరకు క్షేత్రస్థాయిలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్, గోపాల్రావుపల్లి సర్పంచ్ గుండు ప్రేమ్‌కుమార్, ఉపసర్పంచ్ పొన్నాల నర్సింలు, చిన్నలింగాపూర్ మాజీ ఎంపీటీసీ శాగ దేవేందర్, నాయకులు లింగంపల్లి మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు .సోమవారం జిల్లా పోలీస్ ఆఫీస్ లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 33 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

# పండగ వాతావరణంలో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు

### -జిల్లావ్యాప్తంగా 2,720 ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభంలి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు జరిగాయి.

జిల్లాలోని రుద్రంగి, బోయినపల్లి, సిరిసిల్లలో ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,720 ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి.. రుదంగి మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు.

లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు.. అలాగే వేములవాడ అర్బన్ మండలం అనుపురం, వేములవాడ పట్టణంలో లాల పల్లె లో ప్రభుత్వ విప్ ప్రారంబించారు.బోయినపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్, అలాగే తడగొండ గ్రామంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు.సిరిసిల్ల లో ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులతో కలిసి ప్రారంభించారు.

కార్యక్రమాల్లో పీడీ హౌసింగ్ వెంకట మాధవరావు, సీపీఓ శ్రీనివాసాచారి, సిరిసిల్లలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, బోయినపల్లిలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మండల ప్రత్యేక అధికారి శరత్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయశీల, ఆయా శాఖల





# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,**


ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలలోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు.ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు జాతీయ పతాకావిష్కరణ

### ఎంపీడీవో జయశీల

**బలగం టీవీ, బోయినిపల్లి:**

02.06.2026న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఉదయం 7:30 నిమిషములకు జాతీయ పతాకావిష్కరణ జరుపబడునని, ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామ ప్రజలు అందరు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో జయశీల తెలిపారు.





# మృత్యువుతో పోరాడి ఇంటి పెద్ద మృతి..

**-- దిక్కుతోచని స్థితిలో కూలీ కుటుంబం**

**-- ముగ్గురు ఆడపిల్లలతో వీధిన పడ్డ భార్య..**

**-- సాయం చేయాలంటున్న సేవాలాల్ సోషల్ సర్వీస్ సంస్థ**

**బలగంటీవీ,రాజన్న సిరిసిల్ల:**

ష్టాలన్నీ ఆ ఇంట్లోనే తిష్టవేసాయా అన్నట్లుగా ఉంది ఆ కుటుంబ పరిస్థితి. కాయకష్టం చేస్తూ కుటుంబాన్ని సాకుతున్న ఆ కుటుంబ పెద్ద ఒక్కసారిగా మంచాన పడి, చివరకు ప్రాణాలు కోల్పోవడంతో ఆ ఇల్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.. కట్టుకున్న భార్య, ముగ్గురు చిన్నారి ఆడపిల్లలు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మానవత్వంతో దాతలు స్పందించి తమను ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

వివరాల్లోకి వెళితే, రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల పరిధిలోని భూక్యా తండాకు చెందిన గూగులోత్ లింగమూర్తి (38), భార్య లావణ్య దంపతులకు శ్రావణి (13), శ్రీనిధి (10), అమూల్య (8) అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వృత్తిరీత్యా వ్యవసాయ కూలీ అయిన లింగమూర్తి కష్టపడి పని చేస్తూ, తనపైనే ఆధారపడిన భార్యను, ముగ్గురు ఆడపిల్లలను, వృద్ధ తల్లిదండ్రులను సాకుతున్నాడు.గత మూడు సంవత్సరాలుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న లింగమూర్తికి ఇటీవల వ్యాధి తీవ్రత ఎక్కువైంది. దీనివల్ల ఊపిరితిత్తులు, కిడ్నీలు చాలా వరకు దెబ్బతిన్నాయి. మొదట ఆయనను చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో చేర్పించగా, కేవలం మూడు రోజుల్లోనే దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చయింది. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో అంత ఖర్చు భరించలేక, కుటుంబ సభ్యులు ఆయన్ను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ గత 15 రోజులుగా మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్న లింగమూర్తి పరిస్థితి విషమించి సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచాడు.

కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణించడంతో ఆ ఇల్లంతా చీకటిమయమైంది. ఈ దయనీయ స్థితిని గమనించిన స్థానిక గ్రామస్తులు, 'సేవాలాల్ సోషల్ సర్వీస్' సంస్థ ప్రతినిధులు దాతలను ఆర్థిక సాయం కోసం అభ్యర్థిస్తున్నారు. మనం నిత్యం వృథా చేసే చిన్నపాటి మొత్తమైనా ఈ కుటుంబానికి కొండంత అండగా నిలుస్తుందని, ఆ ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్తుకు భరోసానిస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం చేయదలచిన వారు ఈ 9949415677 నెంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా పంపవచ్చుని,అలాగే ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని ఈ నిరుపేద కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని వారు కోరారు.

# నెరవేరిన సొంతింటి కల

### ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన సర్పంచ్ వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ అనిల్ పాలకవర్గం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలలో ఇందిరమ్మండ్లను గ్రామ పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. మండలంలోని అల్మాస్ పూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి కావడంతో తలారి నరేష్ కు చెందిన ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ నాగలి వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ కొర్రి అనిల్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొంతిల్లు కావాలని ఎన్నో కలలు కన్నామని కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకున్నామని తలారి నరేష్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు మహిపాల్, శంకర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

